సాక్షి
శ్రీకాకుళం

సోమవారం ၊ 17 ၊ జూన్ ၊ 2024



విత్తన చట్టం తెలుసా..?

విత్తనాలు విక్రయించేందుకు నిబంధనలు ఉన్నాయి. నిబంధనలు అతిక్రమిస్తే చిక్కులు తప్పవు.

- 8లో



వేర్వేరు ప్రమాదాల్లో..

టెక్కలి పరిధిలో పలుచోట్ల ప్రమాదాలు జరిగాయి. ముగ్గురు గాయపడ్డారు.

- 8లో

నేడు నిమ్మాడకు అచ్చెన్న, రామ్మోహన్ నాయుడు రాక

కోటబొమ్మాళి: కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం సాయంత్రం వారి స్వగ్రామం నిమ్మాడకు రానున్నారు. అనంతరం కోటబొమ్మాళి లోని శ్రీకొత్తమ్మతల్లిని దర్శించుకుంటారని తెలుగుదేశంపార్టీ నాయకులు తెలిపారు. మంత్రులుగా ప్రమాణం చేసిన తర్వాత వారు మొదటిసారిగా స్వగ్రామానికి వస్తుండంతో టీడీపీ అభిమానులు నిమ్మాడలో భారీ స్వాగత ఏర్పాట్లు చేశారు.

న్యూస్‌రీల్

యూబీ ఉద్యోగులపై దాడి

రణస్థలం: మండలంలోని యునైటెడ్ బ్రూవరీస్ పరిశ్రమ ఉద్యోగులపై దాడి చేసిన ఘటనలో 10మందిపై యూబీ యాజమాన్యం ఫిర్యాదు చేసిందని జేఆర్ పురం ఎస్‌ఐ కె.గోవిందరావు తెలిపారు. ఫిర్యాదులో తెలిపిన వివరాలు ప్రకారం.. యూబీ పరిశ్రమ యూనిట్ హెడ్ డి.రామకృష్ణ, ఉద్యోగులు ఎం.ఎల్ రావు, బి.రవికుమార్, కె.అప్పలరెడ్డి, జి. క్రిష్ణంరాజు, టి.ఈశ్వరరావులపై శనివారం మధ్యాహ్నం 12.20 గంటల సమయంలో దాడి జరిగింది. ఎస్‌బీఎస్, టీఏఆర్, ఎంఎస్‌ఆర్ కాంట్రాక్టర్‌లు టి.అప్పారావు, ఎస్.గంగులు, కె.మహాలక్ష్మి, వై.చిన్నారావు, కాకి చిన్నారావు, ఎస్.ఈశ్వరరావు, ఎస్.వెంకటరమణ, ఎస్.లక్ష్మణరావు, కె.బలరాం, వై. మహాలక్ష్మిలు దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వీళ్లతో పాటు మరో 40 మంది వరకు లోపల కార్మికులు, బయట వ్యక్తులు పరిశ్రమ గేటు నుంచి లోపలకి ప్రవేశించారని తెలిపారు. ఈ ఘటనపై ఇంకా కేసు నమోదు చేయలేదని ఉన్నతాధికారులను సంప్రదిస్తున్నామని జేఆర్ పురం ఎస్‌ఐ కె.గోవిందరావు చెప్పారు.

'ఒడియా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి'



మాట్లాడుతున్న సంఘ ప్రతినిధులు

సోంపేట: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఒడియా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని ఒడియా టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర పాఢి అన్నారు. సోంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర నూతన ప్రభుత్వాలకు అభినందనలు తెలిపారు. 117 జీఓ రద్దు చేయాలని, సీబీఎస్‌సీ పాఠశాలల్లో ఆంధ్ర ప్రదేశ్ మాధ్యమిక బోర్డు కొనసాగించాలన్నారు. ఒడియా మాధ్యమంలో కూడా ఎస్‌ఎంఎంఎస్ పరీక్షలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బృందావన్ దొలాయి, సలహాదారులు డీపీ చౌదరి పాల్గొన్నారు.

'రైతులకు సరిపడా విత్తనాలు అందించాలి'

కాశీబుగ్గ: రైతులకు సరిపడా ఎరువులు, విత్తనాలు తక్షణమే సరఫరా చేయాలని, అందులో సబ్సిడీ వర్తించేలా చర్యలు చేపట్టాలని అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు మామిడి భీమారావు అన్నారు. మందస మండలం రట్టి గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైందని, రైతులకు సరిపడా విత్తనాలు ఏ రకం అవసరమో ఆర్‌బీకేల్లో సమాచారం ఉందని, అదే విధంగా విత్తనాలు అందించాలని కోరారు. కొత్త ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం వ్యవసాయ పెట్టుబడులకు రూ.20వేలు తక్షణమే రైతుల ఖాతాల్లో వేయాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో జీడి పిక్కల కొనుగోలు జరగడం లేదని, గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. కాలువలు మరమ్మతు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు నారాయణ, గురయ్య, సూర్యనారాయణ పాల్గొన్నారు.

'వారికి శిక్ష పడాల్సిందే'

శ్రీకాకుళం క్రైమ్ : తల్లి తనను వేధించిందని, కన్నతండ్రిపైనే అభాండాలు మోపేలా మాయ చేసిందని ఓ బాలిక విలేకరుల సమావేశం పెట్టి ఆవేదన వ్యక్తం చేసింది. తల్లి చేసిన పనికి తన తండ్రి కూడా నరకం చూశారని విలపిస్తూ చెప్పింది. శ్రీకాకుళానికి చెందిన ఓ బాలిక ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. తన తల్లితో పాటు ఆమె ప్రియుడికి శిక్ష పడాల్సిందేనని కోరింది. ఆమె చెప్పిన వివరాల్లోకి వెళ్తే.. తన తండ్రి మోటార్ ట్రావెల్స్ నడుపుతుంటారని, ఆయన వద్ద పనిచేసిన వ్యక్తితో తన తల్లి మూడేళ్ల నుంచి సన్నిహితంగా మెలుగుతోందని, అప్పట్లో తనను భయపెట్టి తండ్రిపైనే తప్పుడు పోక్సో కేసు పెట్టించిందని బాలిక చెప్పింది. అంతేకాక నిత్యం తల్లి ప్రియుడు వచ్చి తనపై తప్పుడుగా ప్రవర్తించేవాడని, నాన్న అని పిలవమనేవాడని, ఈ విషయం తన తల్లికి చెబితే తప్పేమీ లేదు, అలాగే పిలవమని ఒత్తిడి చేసేదని చెప్పింది. ఈ విషయం తట్టుకోలేక పక్కింటి వారి ఫోన్ తీసుకుని తన తండ్రికి జరిగిందంతా చెప్పానని, తల్లి వద్ద నుంచి తండ్రి వద్దకు పారిపోయానని తెలిపింది. ఇదే విషయంపై బాధితురాలి తండ్రి మాట్లాడుతూ తన భార్య కుమార్తెను బెదిరించి తనపై తప్పుడు కేసు పెట్టి 45 రోజులు జైలు శిక్ష పడేటట్లు చేయడమే కాక స్లో పాయిజన్ బాటిల్ ఒకటి రెండేసి చుక్కలుగా ప్రతిరోజూ అన్నంలో కలిపి విష ప్రయోగం చేసేదని, తద్వారా తన శరీర అవయవాలు పాడయ్యేలా చేసి చంపేసి తన ఆస్తిని, డబ్బులను కాజేయాలని చూసిందని ఆరోపించారు. తన కోరికలు తీర్చుకునేందుకు కుమార్తెను కూడా బలివ్వాలని ప్రయత్నించిందని, దీనిపై ఎచ్చెర్ల పీఎస్‌లో ఇప్పటికే ఫిర్యాదు చేశామని, తనకు, తన కుమార్తెకు న్యాయం చేయాలని కోరారు.









మంద భోజనానికి వందనం

మంద భోజనం.. పేరు గుర్తుందా..? గొర్రెల కాపర్లు ఊరూరా సంచరిస్తూ పొలాల్లోనే వండుకు తినే విధానమిది. మండు వేసవిలో కూడా రోజుకో చెట్టు కింద బస చేస్తూ ఆ పొలం రైతు ఇచ్చిన కూరగాయలు, బియ్యంతో అదే పొలంలో వండి వారుస్తారు. ఎన్ని స్టార్ హోటళ్ల భోజనాలు రుచి చూసినా మంద భోజనానికి మించిన రుచి ఏదీ ఇవ్వదని తిన్న వారు చెబుతుంటారు. పలాస మండలం బంటుకొత్తూరు పంటపొలం మధ్యలో గొర్రెల కాపరులు ఇలా మంద భోజనం తింటూ కనిపించారు.

- కాశీబుగ్గ



నిఘా నీడన హైవే



- హైవేపై స్పీడ్ గన్‌ల ఏర్పాటు
- ఇంటికే అపరాధ రుసుం పంపించే పద్ధతి
- దారి పొడవునా సీసీ కెమెరాలు
- తప్పు చేస్తే సమీప పోలీసుస్టేషన్‌కు ఫొటో

పెరిగిన నిఘా

జిల్లాలో పంతొమ్మిదేళ్ల కిందట ఏర్పాటైన ఎస్‌హెచ్-5 ఇప్పుడు ఎన్‌హెచ్-16గా పేరు మార్చుకుంది. రహదారి విస్తరణ కూడా దాదాపు పూర్తయ్యింది. ఈ దారిలో హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు ప్రతి కూడలితో పాటు పాటు మార్గం మధ్యలో ఎక్కడిక్కడ అత్యాధునికమైన కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకూ ప్రమాదాలలో స్పష్టత లేక అధిపత్యం ఉన్నవారు లాభం పొందేవారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితులు మారనున్నాయి. ప్రమాదం ఎలా జరిగిందో తెలీక ఇన్స్యూరెన్స్ కంపెనీలు, పోలీసులు ముప్పుతిప్పలు పడేవారు. ఇకపై హైవే అథారిటీ ప్రతి రెండు కిలోమీటర్లు మేర వీడియో రికార్డింగ్ అయ్యే కెమెరాలు సిద్ధం చేశారు.

కాశీబుగ్గ:

జిల్లాలోని జాతీయ రహదారిపై వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు అధికారులు ప్రత్యేక పద్ధతులు పాటిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా అధునాతనమైన సాంకేతికతను జోడించి వాహనదారులకు మేలు చేకూర్చనున్నారు. జాతీయ రహదారిపై అల్లరిమూకలు, మందుబాబులు ఇష్టానుసారంగా వ్యవహరించినా రహదారులపై అధిక సమయం గడిపినా వెంటనే వారి వద్దకు సెక్యూరిటీ చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. రాంగ్ రూట్‌లో ప్రయాణించినా, తప్పు చేసి తప్పించుకోవాలన్నా వారి ఫొటో ఆధారాలతో సమీప పోలీసు స్టేషన్‌లకు డాటాను ఫార్వార్డ్ చేసేలా పరికరాలను అమర్చారు.

నిబంధనలు అతిక్రమించారో..

జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్నప్పుడు నిబంధనలకు విరుద్ధంగా రాంగ్ రూట్‌లో ప్రయాణించినా, ప్రమాదానికి కారణమైనా, వేగంగా వాహనాలు నడిపినా వాటి ఫొటోలు తక్షణమే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిపోతాయి. అక్కడితో ఆగకుండా వారిపై క్రిమినల్ కేసులు కూడా నమోదుచేస్తారు. జాతీయ రహదారిపై అధిక సమయం గడుపుతున్నా, అనుమానం వచ్చినా కంట్రోల్ రూం నుంచి పరిశీలించి తక్షణమే వారి వద్దకు హైవే సిబ్బంది చేరుకుంటారు.

స్పీడ్ గన్‌లు..



జాతీయ రహదారిపై అధిక వేగంతో ప్రయాణించినా, గొలుసు దొంగతనాలు (చైన్ స్నాచర్స్) చేసి టూవీలర్‌తో పరారైనా, లేక హైవే టోల్‌గేటు ఫీజు ఎగ్గొట్టి ప్రయాణించినా, పోలీసుల తనిఖీల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేసినా ఇట్టే పట్టేస్తారు. సుమారు వంద నుంచి 160 కిలోమీటర్లు వేగంతో కార్లు, ఇతర వాహనాలు ప్రయాణించినా ఎలర్ట్‌లో ఉన్న స్పీడ్ గన్‌తో షూట్ చేస్తారు.

భద్రతకు పెద్దపీట



జాతీయ రహదారిలో ప్రయాణిస్తున్నప్పుడు టోల్‌గేటు వద్ద ఫేస్‌వాష్‌లు ఏర్పాటు చేశారు. దారిలో ఎలాంటి ప్రమాదాలు జరిగినా సింగిల్ బటన్ ఫోన్‌లతో కంట్రోల్ రూమ్‌ను సంప్రదించే ఏర్పాట్లు చేశారు. మలుపుల వద్ద ఉన్న స్తంభాలకు హెచ్చరికబోర్డులు, స్టిక్కర్లు, వాతావరణం తెలియజేసే బోర్డులు ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లాలో కంట్రోల్ రూమ్‌లు



జిల్లాలో 160 కిలోమీటర్ల హైవే ఉంది. ప్రతి రెండు కిలోమీటర్లకు కెమెరాతో పాటు ప్రతి 60 కిలోమీటర్లకు టోల్‌గేటుతో పాటు కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసి ఉన్నారు. జిల్లాలో ముఖ్యంగా చిలకపాలెం, మడపాం, లక్ష్మిపురం, ఇచ్ఛాపురం టోల్‌గేట్‌లలో సీసీ కెమెరాలతో కూడిన కంట్రోల్ రూమ్‌లు ఉన్నాయి. ప్రతి కంట్రోల్ రూమ్ వద్ద సుమారు 120 నుంచి 160 మంది సిబ్బంది అన్ని విభాగాల్లో పనిచేస్తున్నారు. హైవేపై ఎలాంటి సమస్య ఎదురైనా అత్యవసర నంబర్ 1033కు కాల్‌చేయవచ్చు.

సక్రమంగా వాహనాలు నడపాలి

జాతీయ రహదారిపై వాహనాలు సక్రమంగా నడపాలి. హైవేపై జరిగే రోడ్డు ప్రమాదాలకు సీసీ ఫుటేజీలు సాక్ష్యాలుగా నిలవనున్నాయి. దారిలో ఏ సంఘటన జరిగినా దాని పరిధిలోని పోలీస్‌స్టేషన్‌కు తెలిసిపోతుంది. అప్రమత్తమై నిమిషాల వ్యవధిలో పట్టుకునే పూర్తి స్థాయి అప్‌డేట్‌కు చేరుకుంది. వాహనదారులు క్రమశిక్షణతో మెలగాల్సి ఉంది.

– వై.శ్రీనివాసరావు,
మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్, పలాస



కంచిలి వద్ద స్పీడ్‌గన్ (కెమెరా)

శ్రుతి మించుతున్న మట్టి మాఫియా ఆగడాలు



దొలిచిన చెరువు గట్టు

- చెరువు గట్టు మట్టి తీయవద్దు అన్నందుకు రైతులపై దాడి
- పోలీసులకు ఫిర్యాదు చేసిన రైతులు

నరసన్నపేట: మండలంలో మట్టి మాఫియా ఆగడాలు శృతి మించుతున్నాయి. ఇష్టానుసారంగా మట్టి తరలిస్తున్నారు. చెరువులు, చెరువు గట్లే లక్ష్యంగా వీరు మట్టి తవ్వి అమ్మకాలు చేస్తున్నారు. ట్రాక్టర్ లోడు రూ. 500, ట్రిప్పర్ లోడు రూ.2 వేలకు విక్రయిస్తున్నారు. రాత్రి, పగలు లేకుండా మట్టిని తరలించి ఇబ్బందులు కలిగిస్తున్నారు. పది రోజుల కిందట మట్టి లోడుతో ట్రిప్పర్ అతి వేగంగా వెళ్తుండగా ఉర్లాం వద్ద అదుపు తప్పి బోల్తా పడ్డ విషయం విదితమే. శనివారం సాయంత్రం మండలం అంపలాంకు చెందిన రైతులపై వీరు దాడికి దిగారు. దీంతో రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చెరువులు, చెరువు గట్లను తొలగించి మట్టిని తరలించకుండా అధికారులు కట్టడి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అంపలాం రెవెన్యూ గ్రామం పరిధిలో చిట్టోడు చెరువు ఉంది. దీని నీటిని రైతులు సమీప పొలాలకు, సొంత అవసరాలకు వినియోగిస్తుంటారు. ఏటా ఉపాధి పనులు చేపట్టి చెరువు గట్లను పటిష్ట పరుస్తున్నారు. ఇందులో భాగంగా ఈ సీజనులో కూడా గట్టు పటిష్ట పరిచారు. ఈ దశలో సమీప మట్టి మాఫియా కళ్లు ఈ గట్టుపై పడ్డాయి. శుక్రవారం గట్టు కట్ చేసి దూకులపాడుకు చెందిన ఒక జేసీబీ యజమాని మట్టిని తరలిస్తుండగా అంపలాంకు చెందిన రైతులు కోల కృష్ణ తదితరులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మట్టి మాఫియా ప్రతినిధులకు రైతులకు మధ్య వివాదం జరిగింది. ఒకరినొకరు తోసుకున్నారు. దీంతో రైతులు నరసన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రైతులు కోల కృష్ణ తదితరులు మాట్లాడుతూ దూకులపాడుకు చెందిన చంద్ర అనే వ్యక్తి దౌర్జన్యంగా చెరువు గట్టు తొలగించి మట్టిని అమ్ముకుంటున్నారని ఆరోపించారు. రైతుల అనుమతి లేకుండా మట్టిని తరలించడంపై ఆయన అభ్యంతరం తెలిపారు. ట్రిప్పర్ లోడు మట్టి రూ.2 వేల వరకూ విక్రయాలు చేస్తున్నారని అన్నారు. దీనిపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. రైతుల ఫిర్యాదుపై నరసన్నపేట ఎస్‌ఐ అశోక్‌బాబు వద్ద ప్రస్తావించగా రైతులకు, జేసీబీ ప్రతినిధికి కౌన్సిలింగ్ చేస్తామని అన్నారు.



ఆందోళన చెందుతున్న రైతులు

ముఖలింగేశ్వరుని కల్యాణోత్సవం ప్రారంభం



ధ్వజారోహణ నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో జ్యేష్ఠ మాసం ఆదివారం మొదటి రోజు రాత్రి శ్రీముఖలింగేశ్వర సహిత వారాహి అమ్మవారి పాంచరాత్రి కల్యాణ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ముందుగా గణపతి పూజతో ప్రారంభమై ఘనంగా ధ్వజారోహణ జరిగింది. పుణ్యాహవచనం, మంటపారాధన, బలిహరణ నిర్వహించి మంగళం పలికారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ప్రభాకరరావు, అర్చకులు, చలం, నాయుడుగారి రాజశేఖర్, శ్రీకృష్ణ శివాజీ తోపాటు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఆదిత్యునికి ప్రత్యేక పూజలు

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. ప్రత్యేక ఆదివారం కావడంతో ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆదిత్యునికి ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. ఉదయం 6 గంటల నుంచి సర్వదర్శనాలకు అనుమతివ్వడంతో ప్రత్యేక అలంకరణలో ఆదిత్యుని దర్శనానికి భక్తులు బారులు తీరారు. మరోవైపు భానుడి ప్రతాపం కూడా పెరగడంతో భక్తులు ఒకింత ఇబ్బందులు పడినప్పటికీ దర్శనాలు సజావుగా సాగడంతో సంతృప్తిగా భక్తులు వెనుదిరిగారు. ఆలయంలో భక్తులకు దర్శనమయ్యేలా ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ప్రత్యేక చర్యలు చేపట్టగా, భక్తులకు క్యూలైన్ల నుంచి దర్శనానికి వచ్చేంతవరకు ఇబ్బందులు లేకుండా ఆలయ ఈఓ ఎస్.చంద్రశేఖర్ తగిన చర్యలు చేపట్టారు. ఇక భక్తులు స్వామికి మొక్కులు చెల్లించే క్రమంలో కొందరు తలనీలాలను సమర్పించుకోగా మరికొందరు ఇంద్రపుష్కరిణి వద్ద ప్రత్యేక పూజలు చేసి ప్రత్యేక ప్రసాదాలను స్వామికి నివేదించారు. అలాగే ఆరోగ్యం కోసం సూర్యనమస్కారాల పూజలు చేయించుకున్నారు. జిల్లాకు చెందిన పలువురు అధికారులు ఆదిత్యుడిని దర్శించుకున్నారు.



పుష్కరిణి వద్ద సంప్రదాయ పూజలు చేస్తున్న మహిళలు



ఉచిత వైద్య సేవలందిస్తున్న వైద్యారోగ్య శాఖ సిబ్బంది

కూర్మనాథుని సన్నిధిలో భక్తుల రద్దీ



తొలి ధ్వజస్తంభం వద్ద భక్తుల క్యూలైన్

గార: శ్రీకూర్మ క్షేత్రంలోని కూర్మనాథుడిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ముందుగా మూలవిరాట్‌ను దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం లక్ష్మీదేవాలయం, వైష్ణవీదుర్గ, తాబేళ్ల పార్కును సందర్శించారు. దేవస్థానంలో జరిగే నిత్యాన్నదానానికి 300 మంది భక్తులు హాజరై ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులు రెండు క్యూలైన్‌ల ద్వారా దర్శనాలు చేసుకున్నారు. ఆలయ ఈఓ జి.గురునాథం, దేవస్థాన సిబ్బంది భక్తులకు అసౌకర్యం కలగకుండా చూశారు.

ఠారెత్తిస్తున్న టమాటా ధరలు

కొత్తూరు: మార్కెట్‌లో టమాటా ధరలు వినియోగదారులను ఠారెత్తిస్తున్నాయి. వారం రోజుల కిందటి వరకు కిలో రూ. 40లు ఉన్న టమాటా ధర వారం రోజుల్లో అమాంతంగా రూ. 80కు పెరిగింది. దీంతో వినియోగదారలకు టమాటాలు కొనుగోలు చేసేందుకు అవకాశం లేకుండా పోయింది. టమాటా ధరలు అదుపులో ఉంచే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.



చంద్రమౌళీశ్వరరావు నేత్రాలు సజీవం

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని చిన్నబరాటం వీధిలో నివాసం ఉంటున్న పట్నాల చంద్రమౌళీశ్వరరావు (72) గుండెపోటు కారణంగా ఆకస్మికంగా మృతి చెందారు. మరణానంతరం ఆయన నేత్రాలు ఇతరులకు ఉపయోగపడాలనే సదుద్దేశంతో ఆయన కుటుంబ సభ్యులు జామి రమేష్, పట్నాల నవీన్‌కుమార్‌లు నేత్రాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. ఈ విషయం రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు తెలియజేయగా, నేత్రసేకరణ కేంద్రం టెక్నికల్ ఇన్‌చార్జి సుజాత, నంది ఉమాశంకర్‌లు చంద్రమౌళీ కార్నియాలను సేకరించి విశాఖలోని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. దాత కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు సభ్యులు దుర్గాశ్రీనివాస్‌లు అభినందించారు. నేత్రదానం చేయాలనుకునేవారు 7842699321 నంబరుకు కాల్‌చేయాలని కోరారు.



నేత్రదాత చంద్రమౌళీశ్వరరావు

గంజాయి రవాణా నివారణకు చర్యలు



జాడుపూడి కాలనీ జంక్షన్ వద్ద హైవేపై తనిఖీలు చేపడుతున్న సెబ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్ తదితరులు

కంచిలి: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతం మీదుగా గంజాయి రవాణా నివారణకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ఆర్. జైభీమ్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో మండలంలో జాడుపూడి కాలనీ జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై ఒడిశా రాష్ట్రం నుంచి వచ్చే బస్సులు, ఇతర భారీ వాహనాలు, కార్గో కంటైనర్లు, ఇతర వాహనాల్ని ఆదివారం విస్తృతంగా తనిఖీలు చేశారు.

ఎవరైనా గంజాయి, ఇతర మాద క ద్రవ్యాలను అక్రమంగా తరలిస్తున్నా కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా సీఐ హెచ్చరించారు. ఈ తనిఖీల్లో సిబ్బంది కాంతారావు, యోగేశ్వరరావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముస్లింలకు బక్రీద్ తోఫా పంపిణీ



బక్రీద్ తోఫా పంపిణీ చేస్తున్న జామియా కమిటీ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: బక్రీద్ పండగను పురస్కరించుకొని 100 ముస్లిం కుటుంబాలకు బక్రీద్ తోఫాను ఆదివారం జామియా మసీదులో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జామియా మసీదు కమిటీ సభ్యులు ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేస్తూ.. సోమవారం ఉదయం 9గంటలకు జామి యా మసీదులో నమాజ్ జరుగుతుందని, ముస్లిం సోదరులందరూ ఉదయం 8.30గంటలకే హాజరు కావాలని కోరారు. కమిటీ అధ్యక్షుడు మహిబుల్లా ఖాన్, గౌరవ అధ్యక్షుడు హాజీ అమిరుల్లా బేగ్, ఉపాధ్యక్షులు హాజీ భయ్యా, జాయింట్ సెక్రటరీ షుకుర్‌ఖాన్, కోశాధికారి ఉస్మాన్, సభ్యులు గుత్తి రఫి, సభ్యులు కరీమ్, దాతలు జాఫర్‌భాయ్, జిలానీ ఖాన్, బహదూర్ జాని, వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ సాదిక్ ఆర్థిక సాయంతో పేద ముస్లింలకు బియ్యం, గోధుమపిండి, ఆయిల్, పంచదారతో తోఫాగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మసీదు ముఫ్తీ జియవుల్ రహ్మా న్, ఖాజీ అబ్దుల్‌ఖా వహాబ్, ఇర్ఫాన్ భాషా, కరీం, షఫీ, అబ్దుల్, మతాబ్ ఖాన్, జిలానీఖాన్, ముబారక్ రోషన్ భాషా, ఇస్మాయిల్ అదేని తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 42 మంది ఎంపిక



జాబ్‌మేళాలో నియామక పత్రాలు ఇస్తున్న ప్రసాద్, కార్తీక్ తదితరులు

నరసన్నపేట: స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన జాబ్‌మేళాలో 42 మందికి ఎంపిక చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. 153 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా వీరిలో 42 మందిని ఎంపిక చేశారు. హెచ్‌ఆర్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ సహకారంతో ఈ జాబ్‌మేళా నిర్వహించామని కళాశాల డైరెక్టర్ దుర్గాప్రసాద్ తెలిపారు. హెచ్‌ఆర్ కో హెడ్ పి.కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

నాక్ కమిటీ సందర్శన



శివానీ కళాశాలను పరిశీలిస్తున్న నాక్ కమిటీ సభ్యులు

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలేంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజీను ఆదివారం నాక్ త్రిసభ్య కమిటీ సందర్శించింది. కళాశాల రిపోర్టును మేనేజ్‌మెంట్ అందజేసింది. శని, ఆదివారాల్లో కమిటీ మొత్తం కళాశాల పరిశీలించింది. తరగతి గదులు, ల్యాబ్‌లు, క్రీడా మైదానం, మౌలిక వసతులు, రిలీవ్ విద్యార్థుల ఉద్యోగ, ఉపాధి ప్లేస్ మెంట్‌లు, వసతి గృహం, క్యాంటీన్, ఫ్యాకల్టీ సభ్యుల విద్యార్హతలు వంటివి బృందం సభ్యులు పరిశీలించారు. ప్రిన్సిపాల్ వై. శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ జీటీ చంద్రశేఖర్, మేనేజ్ మెంట్ సభ్యులు కళాశాలలో పాటిస్తున్న విద్యా ప్రమాణాలు వివరించారు.

'నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలి'



ఐక్యత నినాదం చేస్తున్న తూర్పుకాపు సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నూతనంగా ఏర్పడిన ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం త్వరలో ఎంపిక చేయనున్న నామినేటెడ్ పదవుల్లో శ్రీకాకుళం జిల్లాలోని తూర్పుకాపులకు సముచిత స్థానం కల్పించాలని శ్రీ కాకుళం జిల్లా తూర్పు కాపు సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు సురంగి మోహనరావు కోరారు. నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఆదివారం తూర్పుకాపు సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తరఫున తూర్పుకాపుల నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచిన కిమిడి కళా వెంకటరావు, మామిడి గోవింద రావు, కొండపల్లి శ్రీనివాసలతో పాటు ఎంపీగా గెలిచిన కలిశెట్టి అప్పలనాయుడుకు అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో త్వరలో ఎంపిక చేయనున్న ఎమ్మెల్సీ, జిల్లా పరిషత్ చైర్మన్, గ్రంథాలయ చైర్మన్ తదితర నామినేటెడ్ పదవుల్లో తూర్పుకాపులకు అగ్రతాంబూలం ఇవ్వాలని కోరారు. అలాగే తూర్పు కాపు ఉద్యోగులపై కక్షసాధింపు మానుకోవాలన్నా రు. తూర్పుకాపులను బిసి-డి నుంచి బీసీ-ఎలోకి చేర్చేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో రాడ కై లాశ రావు, శాసపు జోగినాయుడు, కిలారి నారాయణరావు, బుడితి అప్పలనాయుడు, సీనియర్ న్యాయవాదులు వాన కృష్ణచంద్, కెఎల్‌వి రాశేఖర్, లెంక గాంధీ, రౌతు గోపీ, పెంకి చైతన్య, మక్క శ్రీనివాస్, కురిటి దుర్గారావు, దన్నాన మోహన్, లావేటి సుందరరావు, వందాన కుర్మారావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విత్తన చట్టం తెలుసా..?





ఓ ప్రైవేటు విత్తనాల అమ్మకం దుకాణంలో వివిధ రకాల విత్తనాలు

- ప్రతి ప్రైవేటు విత్తనాల దుకాణంలో లైసెన్సు ప్రదర్శించాలి
- కొనుగోలుదారునికి రశీదు తప్పనిసరి

టెక్కలి: ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాలో ప్రైవేట్ ఎరువుల దుకాణాల్లో విత్తనాల విక్రయాలు జోరందుకున్నాయి. అయితే రైతు అవసరాన్ని ఆసరాగా చేసుకుని రైతులను మోసగించే చర్యలకు కళ్లెం వేసేందుకు విత్తన చట్టం ఒకటి ఉందని పూర్తి స్థాయిలో రైతులకు తెలియదు.

విత్తనాలు కొనుగోలు చేసే రైతుకు ఎలాంటి అన్యాయం జరి గినా ఈ చట్టం ద్వారా సంబంధిత విత్తనాల డీల ర్లపై కఠినతరమైన చర్యలు చేపట్టే అవకాశం ఉంది. విత్తన చట్టం 1966, విత్తన నిబంధనలు 1968, విత్తన నియంత్రణ ఉత్తర్వులు 1983 తదితర చట్టా లు పొందు పరచి విత్తనపరమైన అతిక్రమణలు, ఉల్లంఘనలు వర్తించే విధంగా ఈ చట్టాన్ని రూపొందించారు. విత్తన విక్రయాల్లో మోసాలకు పాల్పడిన వారిపై విత్తన నియంత్రణ ఉత్తర్వులు -1983 క్లాజు 3 అతిక్రమించినందుకు ఆయా దుకాణాల్లో విత్తనాలను జప్తు చేయడంతో పాటు అత్యవసర సరుకుల చట్టం 1955 సెక్షన్ ఏ ప్రకారం జరిమానాకు గురవుతారు. వీటిలో కొన్ని చట్టాలను గమనిస్తే...

విత్తన లైసెన్సు ప్రదర్శన తప్పనిసరి

ప్రైవేట్ విత్తనాల విక్రయ దుకాణాల్లో తప్పనిసరిగా విత్తన లైసెన్సును ప్రదర్శించాలి. విత్తన లైసెన్సు లేకుంటే ఆయా దుకాణాల్లో విత్తనాల అమ్మకాలను నిలిపివేయవచ్చు. అంతే కాక నోటీసు ఇస్తూ దానికి సరైన సమాధానం ఇవ్వకపోతే విత్తన నియంత్రణ ఉత్తర్వులు-1983 క్లాజు 5 ప్రకారం డీలర్ లైసెన్సు సస్పెండ్, రద్దు చేయవచ్చు.

ధరల బోర్డు, స్టాకు బోర్డు ఏర్పాటు చేయాలి

విత్తనాలు విక్రయించే దుకాణాల్లో కచ్చితంగా ధరలు, స్టాకు బోర్డులను ఏర్పాటు చేయాలి. అలా లేకుంటే విత్తన నియంత్రణ ఉత్తర్వులు -1983 క్లాజు 8 ప్రకారం ఆయా దుకాణాల్లో విత్తనాల అమ్మకాలు నిలుపుదల చేయవచ్చు. అంతే కాకుండా అధికారులు ఇచ్చిన నోటీసులకు సరైన సమాధానం ఇవ్వకపోతే లైసెన్సు సస్పెండ్, రద్దు చేయవచ్చు.

అమ్మకాల రశీదు ఇవ్వాల్సిందే

విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు ఆయా దుకాణదారుడు కచ్చితంగా రశీదు ఇవ్వాలి. రశీదు ఇవ్వని పక్షంలో విత్తన నియంత్రణ ఉత్తర్వులు-1983 క్లాజు 9 ప్రకారం ఆయా దుకాణదారునికి ముందుగా నోటీసు జారీ చేసి దానికి సరైన సమాధానం ఇవ్వకపోతే ఆయా డీలర్ లైసెన్సును సస్పెండ్, రద్దు చేయవచ్చు.

విత్తనాల బస్తాలపై లేబుల్ లేకపోతే..

ప్రైవేట్ విత్తనాల అమ్మకందారుడి వద్ద కొనుగోలు చేసిన విత్తనాల బస్తాలకు లేబుల్ లేకపోతే విత్తన చట్టం-1966 సెక్షన్ 7 ప్రకారం చర్యలు చేపట్టవచ్చు. అంతే కాకుండా ఆయా విత్తనాలను జప్తు చేసే అధికారం ఉంది. అత్యవసర సరుకుల చట్టం -1955 సెక్షన్ 7 ప్రకారం జరిమానా విధిస్తారు. కాలం చెల్లిన విత్తనాలు విక్రయిస్తే విత్తన చట్టం -1966 సెక్షన్ 7 ప్రకారం విత్తన నియంత్రణ ఉత్తర్వులు -1983 క్లాజు 8 ను అనుసరిస్తూ డీలర్ లైసెన్సు సస్పెండ్, రద్దు చేయవచ్చు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో సుమారు 495 ప్రైవేట్ డీలర్ల దుకాణాలు ఉన్నాయి. వాటిలో సుమారు 132 మంది విత్తనాల విక్రయాల డీలర్లు, 196 మంది ఎరువుల విక్రయాల డీలర్లు, 167 మంది పురుగు మందు విక్రయాల డీలర్లు ఉన్నారు.

నిబంధనలు పాటించాలి

ప్రభుత్వం పొందు పరిచిన విత్తన చట్టానికి అనుగుణంగా ప్రైవేట్ విత్తనాల డీలర్లు విత్తనాలను విక్రయించాలి. ఈ విషయంలో ఆయా డీలర్లు నిబంధనలు అతిక్రమిస్తే భారీగా జరిమానాతో పాటు దుకాణాల లైసెన్సును పోగొట్టుకునే పరిస్థితి ఉంటుంది.

– బీవీ తిరుమలరావు, ఏడీ, వ్యవసాయ శాఖ, టెక్కలి

'వృద్ధులపై వేధింపులు ఆగాలి'



ర్యాలీలో పాల్గొన్న వృద్ధులు

శ్రీకాకుళం కల్చరల్: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ దినోత్సవం సందర్భంగా శాంతాకల్యాణ్ అనురాగ నిలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ వృద్ధులపై వేధింపులు నివారించడానికి, వృద్ధుల పోషణ, సంరక్షణ, వృద్ధుల ఆస్తి, ప్రాణ రక్షణ విషయాలపై ప్రభుత్వ చట్టాలను పటిష్టంగా అమలు జరపాలని అన్నారు. సెంట్రల్ కౌన్సిల్ మెంటర్ ప్రకాశరావు, ప్రధాన కార్యదర్శి నరసింహమూర్తి, అధ్యక్షులు సోమసుందరరావు, కోశాధికారి ప్రసాదరావులు మాట్లాడుతూ వృద్ధులపై వేధింపులు నివారించాలంటే ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ఒక హెడ్ కానిస్టేబుల్‌ను నియమించి సమస్యలపైన స్పందించే ఏర్పాటు చేయాలని, అలాగే వృద్ధులకు రైల్వే కన్సెషన్ తిరిగి పునరుద్ధరించాలని కోరారు. వృద్ధులు తమ శేష జీవితాన్ని సమాజంలో గౌరవప్రదంగా గడిపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం శాంతాకల్యాణ్ అనురాగ నిలయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీని నిర్వహించారు. అనంతరం సంయుక్త కలెక్టర్ నవీన్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో బలివాడ మల్లేశ్వరరావు, పీఎస్ ప్రసాదరావు, బి.జానకిరాం పట్నాయిక్, పి.నరసింహపండా, బి.మోహనరావు, రాజేశ్వరరావు, వి.నాగేశ్వరరావు, పి.నాగేశ్వరరావు, డి.చిరంజీవిరావు, వి.బోడయ్య, కె.రామ్మోహన్‌రావు,గణపతిరావు, గణపతి ఆచారి, బి.పోలయ్య, సోమేష్, ఎస్ కోటేశ్వరరావు, ఎల్.ప్రసాదరావు, అమీరుల్లా బేగ్, ఎస్.భాషా, బి.చిన్మయరావు, జి.ఝాన్సీరాణి, జి.సత్యవతి, పి.అన్నపూర్ణ, టి.లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



బూర్జ హైస్కూల్ 1994 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కలయిక

బూర్జ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994లో టెన్త్ చదివిన వారు ముప్పై ఏళ్ల అనంతరం ఆదివారం మళ్లీ కలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలు నెమరువేసుకుని రోజంతా సందడిగా గడిపారు.

● ముమ్మరంగా వెద దుక్కులు



పొలాల్లో దుక్కి పనులు ఎంచక్కా జరుగుతున్నాయి. ట్రాక్టర్లు, డ్రోజర్స్‌తో రబీ పంటలు వేసేందుకు దుక్కి పనులు చేస్తున్నారు. సంధ్య వేళ శ్రీకాకుళం పరిసర ప్రాంతాల్లో ఈ దృశ్యాలు కనువిందు చేశాయి.

– శ్రీకాకుళం పీఎన్ కాలనీ



నిందితుడు దొరికాడు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని రిమ్స్ రోడ్డులో శుక్రవారం వేటకత్తితో యువకుడిపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడు బొమ్మాళి గిరిని సీఐ గుండుమోను ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో రెండో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శనివారం ఉదయం ఆరు గంటలకు సీతంపేట వద్ద ఉన్నట్లు తమకు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి మాటువేసి పట్టుకున్నట్లు సీఐ వెల్లడించారు. ఇటీవల సబ్‌డివిజనల్ పోలీస్ కార్యాలయం సమీపంలోని గూనపాలెంలో మేడపై నిద్రిస్తున్న వ్యక్తిని భార్యే మరో ఇద్దరి సాయంతో పీక కోసి హత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ఘటన మరువక ముందే శుక్రవారం పట్టపగలు రిమ్స్ నడిరోడ్డుపై కత్తితో వెంటాడి మరీ బొమ్మాళి గిరి, నల్లపిల్లి గౌరీ శంకర్‌పై హత్యాయత్నానికి పాల్పడటం నగర ప్రజలను తీవ్ర భయభ్రాంతులకు గురిచేసింది. వరుస ఉదంతాలతో నగర ప్రజలు భయకంపితులవ్వడంతో ఎస్పీ జీఆర్ రాధిక విషయాన్ని సీరియస్‌గా తీసుకుని నిందితుడిని త్వరగా పట్టుకోవాలని సీఐని ఆదేశించడంతో రెండు బృందాలుగా విడిపోయి గాలించి మరీ పట్టుకున్నారు. గిరి నుంచి కత్తిని స్వాధీనం చేసుకున్నామని, ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు సీఐ చెప్పారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

టెక్కలి రూరల్: మండలంలో ఆదివారం జరిగిన పలు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని నౌపడ గేటు సమీపంలో ఆదివారం సాయంత్రం ఇజ్జువరం గ్రామానికి చెందిన గేదెల అప్పన్న అనే వ్యక్తి రోడ్డు దాటుతుండగా టెక్కలి నుంచి నౌపడ వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో గాయపడిన అప్పన్నను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల సమీపంలో సోగ్గాడి పేటకు చెందిన డి.దమయంతి అనే మహిళ రోడ్డు పక్కగా నడిచి వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలకు గురైన మహిళను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అలానే స్థానిక జిల్లా ఆస్పత్రి సమీపంలో రోణంకి అప్పన్న అనే వ్యక్తి రోడ్డు దాటుతుండగా టెక్కలి నుంచి సీతాపురం వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలకు గురయ్యాడు. గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలపై సమాచారం అందుకున్న పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

'వైన్స్‌షాపులు, బార్‌లలో 10 శాతం మాకు కేటాయించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న రత్నాల కాశీవిశ్వనాథ చౌదరి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నూతన ప్రభుత్వం అబ్కారీ విధానంలో షాపులు, బార్ కేటాయింపులో 10 శాతం సొండి కులానికి కేటాయించాలని సొండికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రత్నాల కాశీవిశ్వనాథ చౌదరి కోరారు. నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఆదివారం ఏపీ రాష్ట్ర సొండి కుల సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 సంవత్సరంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి తరఫున అఖండ విజయం సాధించిన నూతన ప్రభుత్వానికి సొండికుల సంక్షేమ సంఘం తరఫున అభినందనలు తెలిపారు. సొండికుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, మర్చంట్ నేవీ సాహుకారి నాగేశ్వరరావు మాట్లాడుతూ తమ కులం ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, భాషాపరంగా అత్యంత వెనుకబడిందని చెప్పారు. సొండి కులం కాపుసారాయి తయారుచేసి అమ్ముకునే కులవృత్తి కలిగిన ఏకైక కులమన్నారు. 2023లో చంద్రబాబు తెలంగాణలో గౌడ కులస్తులకు కల్పించిన మాదిరి తమకు కూడా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. సొండి కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని తాము కోల్పోయిన బీసీ-ఎ పునరుద్ధరించడంతో పాటు ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న తమ కులస్తులను ఇదివరకు మాదిరిగా 'ఆబార్జినల్ ట్రైబల్'గా గుర్తించాలని కోరారు. సొండి కులాన్ని కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేశారని, కావున నూతన ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం తమ కులాన్ని కేంద్ర బీసీ జాబితాలో చేర్చుటకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. సమావేశంలో కోశాధికారి రత్నాల శ్రీనివాసరావు, రత్నాల నర్సింహమూర్తి, రత్నాల జగన్మోహనరావులు పాల్గొన్నారు.

'జానపద కళలను కాపాడాలి'



జానపద కళాకారుల ఆత్మీయ సమ్మేళనం

పలాస: సమాజంలో అంతరించిపోతున్న జానపద కళలను కాపాడాలని, అందుకు ప్రభుత్వాలు తగిన సహకారం అందించాలని, వృత్తి కళాకారులకు పింఛన్ సదుపాయం కల్పించాలని పలువురు కవులు, కళాకారులు కోరారు. కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రంగోయి గ్రామానికి చెందిన గిడుదు రామ్మూర్తి తెలుగు భాషా, జానపద కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు బద్రి కూర్మారావు అధ్యక్షతన జానపద కళాకారులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా నలుమూలల నుంచి జానపద కళాకారులు, రచయితలు, కవులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేసి ప్రభుత్వానికి నివేదించాలని కోరారు. ముఖ్యంగా జానపద కళాకారులకు, వృత్తి కళాకారులకు పింఛన్ సదుపాయాలు కల్పించాలని, జానపద కళలను పరిరక్షించాలని, అందుకు ప్రభుత్వం తగిన వేదికలపై అవకాశాలు కల్పించాలని కోరారు. సినీ గాయకుడు బాడ సూరన్న, కవులు బమ్మిడి సుబ్బారావు, డాక్టరు కుమార్‌నాయక్, గొర్లె కామరాజు, ఇసాకోటి జోగారావు, బాలక లోకనాథం, అమ్మ రామకృష్ణ, బత్తిన ఓంకార్, దున్న శకుంతల, తోట రమణమ్మ, నిశితాసి, మద్దు నాగేశ్వరరావు, కోనేరు ఆదినారాయణ, తామాడ సన్యాసిరావు, మద్దు తిరుపతిరావు తదితరులు తమ ఆటపాటలతో అలరించారు. ఈ సందర్భంగా గత ఏడాది రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జానపద కళాకారుడు సాలిన అశోక్ కుటుంబానికి రూ. 30వేలు ఆర్థిక సాయం అందజేశారు.

'విద్యావ్యవస్థ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి'



మంత్రి అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న నోబుల్ టీచర్స్ సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయుల సమస్యలతోపాటు విద్యావ్యవస్థ అభివృద్ధికి కూటమి ద్వారా ఏర్పాటైన నూతన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ కార్యదర్శి బమ్మిడి నరేంద్రకుమార్, జిల్లా అధ్యక్షుడు సూర పాపారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విజయవాడలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడును తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం నోబుల్‌టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తలిపారు. అనంతరం వినతిపత్రాన్ని అందజేశారు. 12వ పీఆర్సీకి సంబంధించి వెంటనే ఐఆర్‌ను ప్రకటించాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని, వెంటనే జీఓ నంబర్ 117ను రద్దు చేయాలని, ఉన్నత పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియం రెండూ కొనసాగించాలని కోరారు. ఉన్నత పాఠశాలలకు డిజిటల్ అసిస్టెంట్‌లను నియమించి ఉపాధ్యాయులపై పని ఒత్తిడిని తగ్గించాలని, తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే వర్తింపజేయాలని, రోల్ సంఖ్యతో సంబంధం లేకుండా అన్ని ఉన్నత పాఠశాలలకు హెచ్‌ఎం, పీఈటీ పోస్టులను మంజూరు చేయాలని, నెలవారీ పదోన్నతులు పునరుద్ధరించాలని, 70:30 నిష్పత్తిలో జేఎల్స్ పదోన్నతులు కల్పించాలని, అన్ని యాజమాన్య పాఠశాలల ఉపాధ్యాయులకు జీపీఎఫ్ అమలుచేయాలని కోరారు.

ఉత్సాహంగా ఆర్చరీ ఎంపికలు



ఎంపికలకు హాజరై తమ పేర్లను నమోదు చేసుకుంటున్న క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అరసవల్లి రోడ్డులోని ఆదిత్య ఆర్చరీ అకాడమీ ప్రాంగణంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఆర్చరీ ఎంపికలు ముగిశాయి. ఆదివారం ఉత్సాహంగా సాగిన ఈ ఎంపికల్లో 16 మంది క్రీడాకారులు హాజరై తమ ప్రతిభను నిరూపించుకున్నారు. ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు ఏలూరు రోడ్‌లోని చిట్టగుంట వేదికగా జరగనున్న ఏపీ రాష్ట్రస్థాయి పోటీలకు ఇక్కడ ఎంపిక చేసిన క్రీడాకారులను పంపించనున్నట్టు జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎల్.చిట్టిబాబు తెలిపారు. ఇండియన్ రౌండ్స్, రికర్వడ్ రౌండ్, కాంపౌండ్ రౌండ్స్ పోటీలకి క్రీడాకారులు ఎంపికైనట్టు అకాడమీ ప్రతినిధి చిటీకం రాజకుమార్ పేర్కొన్నారు. అకాడమీ ప్రారంభం నుంచి క్రీడాకారులను ప్రోత్సహించేలా ఎంపిక పోటీలకు ఆతిథ్యం ఇస్తూ జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులను తయారు చేస్తున్నామని రాజ్‌కుమార్ వెల్లడించారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి, పీఈటీ సంఘ జిల్లా అధ్యక్షుడు మొజ్జాడ వెంకటరమణ, టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా జగదీష్, అకాడమీ శిక్షకులు ఆరక భూషణరావు, ఆరవ రాము, సంగమేశ్వరరావు, తల్లిదండ్రులు టి.వెంకటేశ్వరరావు, ఉమామహేశ్వరరావు, చంద్రమౌళి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్‌పై వ్యక్తి మృతదేహం

టెక్కలి రూరల్: మండలంలోని జెండాపేట గ్రామ సమీపంలో గల రైల్వే ట్రాక్‌కు కొంత దూరంలో ఆదివారం సాయంత్రం ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న టెక్కలి ఎస్‌ఐ-2 వెంకటేశ్వరరావు, ఏఎస్‌ఐ వెంకటరమణలు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడిని వెస్ట్‌బెంగాల్‌కు చెందిన హుమయాన్ మే అనే వ్యక్తిగా గుర్తించారు. మృతికి గల కారణాలు తెలియడం లేదని పోలీసులు తెలిపారు.

బావమరిదిని కాల్చి చంపిన బావ

పర్లాకిమిడి: సొంత బావమరిదిని నాటుతుపాకీతో కాల్చి చంపిన ఘటన గజపతి జిల్లా బలియాగోణి గ్రామంలో ఆదివారం వెలుగుచూసింది. మోహానా పోలీస్‌స్టేషన్ పరిధిలోని బలియాగోణి గ్రామంలో కై లాష్ నాయక్ (56) శనివారం సాయంత్రం అటవీ ప్రాంతానికి కట్టెలు తీసుకొచ్చేందుకు వెళ్లాడు. ఎంతసేపైనా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు మోహానా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు, బంధువులు అటవీ ప్రాంతంలో వెతకగా కైలాష్ నాయక్ మృతదేహం కనుగొన్నారు. పోలీసులు తమదైన శైలిలో విచారించగా పాతకక్షలతో సొంత బావ ఉదయ్ నాయక్ ఈ హత్య చేసినట్లు తేలడంతో అరెస్టుచేశారు.